
www.vaarthavedhikasurya.com
PRGI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




| తెలంగాణ Telangana | ఆదివారం Sunday | 15 -02 -2026 15 -02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 260 Issue: 260 | పేజీలు : 08 Pages: 08 | వెల :05/- Cost :05/ | ఎడిటర్ : పోలోజు శ్రీనివాస చారి Editor: POLOJU SRINIVASA CHARY |
|---|---|---|---|---|---|---|---|

## ముంబైలో కూలిన మెట్రో పిల్లర్

- రోడ్డుపై వాహనాలపై పడిన నిర్మాణ స్తంభం.
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు.
- ట్రాఫిక్ స్తంభనతో ములుంద్‌లో కలకలం.



2

## ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు

- టాయిలెట్‌లో లభించిన బెదిరింపు స్లిప్.
- ప్రయాణికుల అత్యవసర తరలింపు.
- భద్రతా తనిఖీల అనంతరం స్పష్టత.



# సంక్షేమ పాలనకు లభించిన ప్రజా తీర్పు

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ స్పందన.
- 116 మున్సిపాలిటీల్లో 64 చోట్ల కాంగ్రెస్ విజయం.
- వార్డు స్థాయిలో హస్తం ఆధిపత్యం.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14(వార్త వేదిక సూర్య):** తెలంగాణలో జరిగిన పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఫలితాలు తమ సంక్షేమ పాలనకు, ప్రజల తెలంగాణ నమూనాకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని ఆయన పేర్కొన్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, ఈ విజయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు మరియు తెలంగాణ ప్రజలకు అంకితం చేశారు. ప్రతి కుటుంబానికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే తమ లక్ష్యం పట్ల కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను కాంగ్రెస్ పార్టీ 64 చోట్ల జయకేతనం ఎగురవేసింది. అలాగే 7 నగరపాలక సంస్థల్లో మూడింటిని కైవసం చేసుకుంది. మంచాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో చేరడం పార్టీకి కీలక విజయంగా నిలిచింది. ప్రధాన

2 లో






## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు

- వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో మర్యాదం పూర్వక భేటీ.
- పీసీసీ అధ్యక్షుడు, మంత్రి, ఎంపీ తదితరుల హాజరు.
- ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్ల సమావేశం.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ కు చెందిన 8 మంది కౌన్సిలర్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మిగతా 2 లో...

## సంగారెడ్డి ఘటనపై పోలీసు సంఘాల మౌనం

- ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్.
- వార్డు 34 వివాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చ.
- పోలీసుల మనోబలంపై ప్రశ్నలు.
- ప్రభుత్వ స్పందనపై ప్రతిపక్షాల ఆక్షేపణ.



2

## భర్త మృతిని తట్టుకోలేక చెరువులో దూకిన మహిళ

- నర్సాపూర్ మండలంలో విషాద ఘటన.
- నాలుగు నెలల క్రితం భర్త మృతి.
- కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు.

## కేబీఆర్ పార్క్‌లో డాగ్ అడాప్షన్

- ప్రజాప్రతినిధుల ఆదర్శ దత్తత.
- వీధి కుక్కల సంరక్షణపై అవగాహన.
- జంతు ప్రేమకు నగర వాసుల స్పందన.
- హాజరైన మంత్రులు.



2 లో

## కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు రాలేదన్న కేటీఆర్

- హంగ్ మున్సిపాలిటీల్లోనూ బీఆర్ఎస్‌కు అవకాశాలున్నాయన్న విశ్వాసం.
- ఫార్ములాఈ అంశంపై మరోసారి ప్రభుత్వంపై విమర్శలు.
- స్థానిక ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ చిట్‌చాట్.



**హైదరాబాద్, ఫిబ్రవరి 14(వార్త వేదిక సూర్య):** స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. వచ్చిన ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ అసంతృప్తిగానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఆశించినన్ని స్థానాలు రాలేదని పేర్కొన్నారు. మిగతా 2 లో...

## రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

- బండి సంజయ్‌ను వారియర్‌గా అభివర్ణించిన ఎంపీ.
- కార్పొరేటర్ల ఎత్తుకెళ్లింపులపై హెచ్చరిక.
- నిజామాబాద్ ఫలితాల్లో బీజేపీ ఆధిక్యం అని వ్యాఖ్య.



2 లో

# ముంబైలో కూలిన మెట్రో పిల్లర్

**ముంబై, 14 ఫిబ్రవరి 2026 (వార్త వేదిక సూర్య):**

మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ అకస్మాత్తుగా కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. ములుండ్ ప్రాంతంలోని ఎల్బీఎస్ రోడ్ సమీపంలో, జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కూలిన పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై పడటంతో తీవ్ర నష్టం సంభవించింది. ప్రమాద సమయంలో అక్కడుగా వెళ్తున్న ఒక ఆటో రిక్షా, ఒక కారుపై మెట్రో పిల్లర్ పడింది. దీంతో వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. మరో నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ



అధికారులు, బీఎంసీ అధికారులు, మెట్రో సంస్థ ప్రతినిధులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్య సహాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో ములుండ్ ప్రాంతంలో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు

**కోల్‌కతా,ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సంచలన ఘటన చోటుచేసుకుంది. ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం ఉదయం 9.15 గంటలకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌కు బయలుదేరాల్సిన విమానంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఎక్కిన అనంతరం టాయిలెట్‌లో చేతితో రాసిన బెదిరింపు స్లిప్‌ను సిబ్బంది గుర్తించారు. స్లిప్‌లో బాంబు ఉన్నట్లు పేర్కొనడంతో సిబ్బంది వెంటనే విమానాశ్రయ అధికారులను అలెర్ట్ చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యగా విమానాన్ని ఐసోలేషన్ బే వద్దకు తరలించారు. భద్రతా ప్రోటోకాల్ మేరకు విమానంలోని అన్ని ప్రయాణికులను సురక్షితంగా ఖాళీ చేయించారు. ప్రయాణికులను టెర్మినల్ ప్రాంతానికి తరలించి అదనపు భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతా దళాలు, బాంబు నిర్వీర్య దళాలు విమానాన్ని పూర్తిగా తనిఖీ చేశాయి. ప్రతి సీటు, సామాను విభాగం, టాయిలెట్ ప్రాంతం సహా అన్ని భాగాలను సోదా చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాథమికంగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని సమాచారం. అయితే బెదిరింపు స్లిప్ ఎలా వచ్చింది అన్న దానిపై విచారణ కొనసాగుతోంది. ఇండిగో సంస్థ భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అధికారులతో పూర్తిగా సహకరించినట్లు వెల్లడించింది. ఈ ఘటనతో విమానాశ్రయంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది. బెదిరింపు వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ప్రయాణికుల భద్రతే తమకు ప్రథమ ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేశారు.



## సంక్షేమ పాలనకు లభించిన ప్రజా తీర్పు

**మొదటిపేజీ తరువాయి...** ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లతో పరిమితమైంది. మరో 38 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించకపోవడంతో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ ఆధిపత్యం ప్రదర్శించగా, ఈసారి బీఆర్ఎస్ పనితీరు గణనీయంగా తగ్గినట్లు ఫలితాలు వెల్లడించాయి. బీజేపీ సొంతంగా ఒక్క మున్సిపాలిటీని గెలవనప్పటికీ, కరీంనగర్, నిజామాబాద్ నగరపాలక సంస్థల్లో అతిపెద్ద పార్టీగా అవతరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను కాంగ్రెస్ 1,347 వార్డుల్లో విజయం సాధించగా, బీఆర్ఎస్ 717, బీజేపీ 261 వార్డులను గెలుచుకున్నాయి. బుధవారం జరిగిన పోలింగ్‌లో 73 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక అధికారిక ఫలితాలను ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల భవిష్యత్ దిశను నిర్దేశించనున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సంగారెడ్డి ఘటనపై పోలీసు సంఘాల మౌనం

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి వార్డు 34లో చోటుచేసుకున్న ఘటనపై రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలో సీసీఎస్ సీఐ శివకుమార్ యాదవ్, డీఎస్పీ సత్తయ్య గౌడ్ సహా పోలీసులపై దుర్భాషలాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి అరెస్టులు జరగలేదని, పోలీసు సంఘాలు మరియు ఐపీఎస్ అసోసియేషన్లు స్పందించలేదని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ విషయంపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలపై సంఘాలు వెంటనే స్పందించాయని, ఇప్పుడు మౌనం ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే ఈ ఘటనపై దృష్టి సారించి బాధిత పోలీసులకు న్యాయం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధిత అధికారులతో మాట్లాడి భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ ఘటన పోలీసు వ్యవస్థ ప్రతిష్టకు మచ్చ కాదా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పోలీసుల మనోబలాన్ని దెబ్బతీసే సంఘటనలపై ప్రభుత్వం, సంబంధిత సంఘాలు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. విధుల్లో ఉన్న అధికారులను అవమానించడం సమాజానికి తప్పుడు సందేశమని పేర్కొంటూ, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు

**మొదటిపేజీ తరువాయి...** ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై చర్చించినట్లు సమాచారం. సీఎంను కలిసిన వడ్డేపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లలో కుర్వ పావని (1వ వార్డు), శారద (2వ వార్డు), మంజుల (4వ వార్డు), యుగేందర్ రెడ్డి (5వ వార్డు), దేవమ్మ (6వ వార్డు), విజయ్ భాస్కర్ (7వ వార్డు), జయశ్రీ (8వ వార్డు), ఎరుకల తిమ్మప్ప (10వ వార్డు) ఉన్నారు. జిల్లా అభివృద్ధి, మున్సిపల్ సమస్యల పరిష్కారం, ప్రజా అవసరాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసినట్లు వర్గాలు పేర్కొన్నాయి.

## కేబీఆర్ పార్క్‌లో డాగ్ అడాప్షన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**

హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్‌లో శనివారం డాగ్ అడాప్షన్ కార్యక్రమం నిర్వహించారు. జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీధి కుక్కల సంరక్షణ, దత్తత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క హాజరయ్యారు. మంత్రి సురేఖ చేతుల మీదుగా సీతక్క ఒక స్వదేశీ కుక్కపిల్లను దత్తత తీసుకున్నారు. ఎంపీ రేణుక చౌదరి కూడా ఒక కుక్కపిల్లను అడాప్ట్ చేసుకుని జంతు ప్రేమకు నిదర్శనంగా నిలిచారు. ప్రజాప్రతినిధులు స్వయంగా ముందుకు రావడం కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ కుక్కలు విశ్వాసానికి ప్రతీకలని పేర్కొన్నారు. అవి దాడి చేయడం సాధారణంగా ప్రేరేపణ వల్లేనని, సరైన సంరక్షణ, ప్రేమ, ఆహారం అందిస్తే అవి మన కుటుంబ సభ్యుల్లా మారతాయని చెప్పారు. వీధి కుక్కలను దూరం చేయడం కంటే దత్తత తీసుకుని సంరక్షించాలనే దృక్పథం సమాజంలో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం దత్తత, సంరక్షణ ద్వారానే సాధ్యమని నిర్వాహకులు తెలిపారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ కనీసం ఒక జంతువును దత్తత తీసుకుని ప్రేమతో పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నగరంలో జంతు సంక్షేమంపై సానుకూల చర్చకు దారితీసింది.

# కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు రాలేదన్న కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి...** తమ పార్టీ కార్యకర్తలు గట్టి పోరాటం చేసి అద్భుతంగా నిలిచారని తెలిపారు. మొత్తం 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని భావించి నప్పటికీ, వచ్చిన 17 మున్సిపాలిటీలతో పాటు హంగ్ ఏర్పడిన ప్రాంతాల్లో కూడా తమకు విజయావకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ తమ ప్రదర్శన బాగుందని చెప్పుకోవడం అర్థం కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. గతంతో పోలిస్తే వారికి తక్కువ ఓట్లు, తక్కువ వార్డులు వచ్చాయని అన్నారు. జాతీయ అధ్యక్షుడిని తెచ్చి ప్రచారం చేసినా ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లోకల్ అంశాలే కీలకమని, అధికారంలో ఉన్నవారికి సాధారణంగా అనుకూల పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిందని, కాంగ్రెస్ విచ్చలవిడిగా ఖర్చు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్ని స్థానాలు గెలిచిందో అందరికీ తెలుసని ఆయన గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. ఫలితాలు ఆశించినంతగా రాని జిల్లాల్లోనూ పార్టీ శ్రేణులు గట్టిగా పోరాడాయని, ఈ ఎన్నికలు తమకు సంతృప్తికరమైనవేనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత విమర్శలు చేసిన వారికి ఈ ఫలితాలే సమాధానమని వ్యాఖ్యానించారు.ఎక్స్ అఫీషియో సభ్యుల నిబంధనల విషయంలో ప్రభుత్వానికే స్పష్టత లేదని కేటీఆర్ అన్నారు. కలెక్టర్లు, చీఫ్ సెక్రటరీ భిన్నాభిప్రాయాలు చెబుతున్నారని విమర్శించారు. ఫార్ములాఈ అంశాన్ని మరోసారి ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోందని, ఇప్పటికే పలుమార్లు విచారణకు పిలిచినా ఏమీ తేలలేదని పేర్కొన్నారు. ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతామని, సత్యాన్ని చెబుతామని స్పష్టం చేశారు. అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా భయపడబోమని, ఆ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని పోలీస్, ఏసీబీ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రికి చెప్పారని ఆయన పేర్కొన్నారు.



## రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అరవింద్ విమర్శలు

**నిజామాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):** నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు సరిపోతారని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో లేరని అన్నారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, కార్పొరేటర్లను ఎత్తుకెళ్లే ప్రయత్నాలు చేస్తే మరింత ప్రతికూలత ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలు బీజేపీ గెలుచుకుందని తెలిపారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు సాధించామని వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని అరవింద్ ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించారని, వారిపై కేసు పెట్టాలని తాను భావించగా పోలీసులే తనపై కేసు నమోదు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు సూచించారనే ఆరోపణలు కూడా చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లేందుకు కాంగ్రెస్‌కు పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కారణంతో ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమని, ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్ల స్వేచ్ఛ అని అన్నారు. బలవంతపు రాజకీయాలు సరికాదని హెచ్చరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

## భర్త మృతిని తట్టుకోలేక చెరువులో దూకిన మహిళ

**నర్సాపూర్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):** మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. భర్త మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ చెరువులో దూకి ప్రాణాలు తీసుకుంది. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన ఆకుల లక్ష్మీ (58) ఈ దుర్ఘటనకు గురైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రంజిత్ కుమార్ వివరాల ప్రకారం, లక్ష్మీ భర్త శివరాములు నాలుగు నెలల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె తీవ్ర మనోవేదనలో ఉండేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గ్రామ సమీపంలోని చెరువులోకి వెళ్లిన లక్ష్మీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. చుట్టుపక్కల వెతికిన సమయంలో చెరువు గట్టు వద్ద లక్ష్మీ చెప్పులు కనిపించడంతో అనుమానం వ్యక్తమైంది. వెంటనే చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి పడటంతో శుక్రవారం రాత్రి గాలింపు నిలిపివేశారు. శనివారం ఉదయం మళ్లీ చెరువు వద్దకు వెళ్లి చూడగా లక్ష్మీ మృతదేహం ఒడ్డున పడి ఉన్నట్లు గుర్తించారు. తన తండ్రి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన తన తల్లి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు సాయి తేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# రంగారెడ్డి

# ప్రభుత్వ పనుల్లో ఒకే పార్టీకి ప్రాధాన్యత ఏంటి?

**- అధికారులకు బి.ఆర్.ఎస్ ప్రశ్న**

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 14 ( వార్త వేదిక సూర్య) :**



నెక్నంపూర్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు కలుషిత నీటి శుద్ధి పనుల పర్యవేక్షణలో ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానిక బి.ఆర్.ఎస్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన 2.35 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న పనుల్లో కేవలం ఒకే పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పెద్ద చెరువు నీటిని శుద్ధి చేసి ఇబ్రహీం బాగ్ చెరువుకు తరలించాలని పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో తాము గతంలోనే అనేకమార్లు అధికారులకు విన్నవించామని గుర్తు చేశారు. అయితే, పనులు మొదలుపెట్టే సమయంలో మున్సిపల్, ఇరిగేషన్ మరియు హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా ఉండాల్సింది పోయి, కేవలం కాంగ్రెస్ నాయకులను, మాజీ మున్సిపల్ చైర్మన్‌ను మాత్రమే వెంటేసుకుని పర్యవేక్షించడం వెనుక అంతర్య మేమిటని ప్రశ్నించారు. కొంతమంది అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహ రిస్తున్నారు. రాజకీయం చేయాలనుకుంటే ఉద్యోగాలకు రాజీనామా చేసి పార్టీ కండువాలు కప్పుకోవాలి. ప్రభుత్వ నిధులతో జరిగే పనుల్లో పక్షపాతం చూపిస్తే ఊరుకునేది లేదు" అని నాయకులు హెచ్చరించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసనలో బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, బండమీది మల్లేశ్, భానుచందర్, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమన్, దేవి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి




మునిజనంబులు, దేవగణంబులు
పొగడగ ఒంటికి తోలుచుట్టి నుదుట
విభూతి ధరించి నిరాడంబరంగా
నిష్కల్మషంగా బతకడం లో
అర్థం,పరామార్థముందని
గ్రహించి నడవాలిని చెప్పకనే చెప్పిన మోక్ష ప్రదాత..!

స్త్రీశక్తివిశిష్టతను తెలియచెప్పేందుకు
అర్థనారీశ్వర రూపంలో అవతరించి
ఆచరణలోనూ, ఆలోచనలోనూ
కర్మలలోను, ఒకటిగా చెరిసగముగా
ఉండాలని చెప్పిన ఓ వరప్రదాత..!

ప్రపంచ మేలు కోసము కాలకూటం
విషాన్ని గళంలో దాచిన గరళ కంఠుడా..!
మంగళానికే మంగళకరుడైన దేవ
అందుకో అందుకో మా వందనాలు..!

దివి నుండిపెద్దశబ్దం చేసుకుంటూ
వస్తున్న గంగమ్మను పుడమి
ముక్కలు కాకుండా జటాజూటాల
నుండి భువికి దింపిన గంగాధర..!
మంగళానికే మంగళకరుడైన దేవ
అందుకో అందుకో మా మంగళహారతులు..!

లింగోద్భవం జరిగిన మహాశివరాత్రి
పర్వదినాన శివుని ఆశీస్సులు మీకు,
మీ కుటుంబ సభ్యులకు ఉండాలని
కోరుకుంటూ..
మహాశివరాత్రి శుభాకాంక్షలు 2026



శ్రీమతి మంజుల
పత్తిపాటి(కవయిత్రి)
మాజీ ఆలేరు వ్యవసాయ
మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి
9347042218

# దాతృత్వంలో సిద్దేశ్వర శర్మ బృందం ముందంజ

**- 160 మందికి అండగా నిలిచిన వైనం**
**- విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వు.. దాతల చేయూత!**

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 14 ( వార్త వేదిక సూర్య) :**

"రేపటి పౌరులను తీర్చిదిద్దే క్రమంలో విద్యార్థులకు అందించే ప్రతి చిన్న సాయం వారి భవిష్యత్తుకు గొప్ప పునాది అవుతుంది" అని నేతాజీనగర్ మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో మానవత్వమే పరిమళించే ఒక చక్కని సేవా కార్యక్రమం జరిగింది.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి, ప్రముఖ దాత సిద్దేశ్వర శర్మ మరియు వారి బృందం ఉదారంగా ముందుకు వచ్చారు. పాఠశాలలోని మొత్తం 160 మంది విద్యార్థులకు భోజన పళ్ళాలను (స్టీల్ ప్లేట్స్) ఉచితంగా అందజేసి, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. తమ స్వార్థం చూసుకోకుండా సమాజ హితం కోసం పాటుపడుతున్న సిద్దేశ్వర శర్మ బృందాన్ని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. వారి సేవలను గుర్తిస్తూ పాఠశాల ఇంచార్జ్ మమత మరియు ఇతర ఉపాధ్యాయులు దాతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "సమాజంలో ఇటువంటి దాతలు ఉండటం ప్రభుత్వ పాఠశాలలకు ఒక గొప్ప ఆసరా" అని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో బుద్వేల్ రైల్వే స్టేషన్ పాఠశాల హెచ్.ఎం శివ పవన్ రాజ్, మధుబన్ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటయ్య, అలాగే నేతాజీనగర్ స్కూల్ ఉపాధ్యాయులు మహేశ్వర్, యాదమ్మ, లక్ష్మీ మరియు విద్యార్థులు, పాల్గొన్నారు.






# ప్రయోగాత్మక విద్యతో ఉన్నత శిఖరాలకు చేరాలి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 14 ( వార్త వేదిక సూర్య ) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవపల్లి డివిజన్ పరిధిలోని సాయి మోడల్ స్కూల్ లో నిర్వహించిన "రోబోటిక్స్ సైన్స్ ఫెయిర్" ప్రదర్శనను ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల రోబోటిక్ నమూనాలు, సైన్స్ ప్రాజెక్టులను ఆయన ఆసక్తిగా తిలకించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు చిన్నతనం నుంచే ఇటువంటి నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదపడతాయని ఆయన కొనియాడారు.విద్యార్థులు కేవలం పుస్తక విజ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇంతటి చక్కని ప్రదర్శనను ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను మరియు అద్భుతమైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# జీనియస్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**( యాదాద్రి భువనగిరి బ్యూరో ), ఫిబ్రవరి 14 వార్తా వేదిక సూర్య**

పట్టణంలోని జీనియస్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంతో పాఠాలు బోధిస్తున్నామని తెలిపారు. అన్ని రంగాలలో విద్యార్థులు రాణించడానికి వారిని ప్రోత్సహిస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. యూకేజీ విద్యార్థులకు ఇలాంటి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో అనుభూతిని పొందుతారని తెలిపారు. అదేవిధంగా చైర్మన్ పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అన్ని వసతులతో పాటు వనరులను సమకూర్చి విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా విశాలమైన తరగతి గదులు క్రీడాస్థలాలు ఏర్పాటు చేసి విద్యార్థులను అన్ని రంగాలలో ముందు ఉంచడానికి మా యాజమాన్యం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తోట శ్రీధర్ ప్రిన్సిపల్ బి స్వర్ణలత ఏవో జి రవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ఈనెల 16న చైర్మన్, వైస్ చైర్మన్ వార్డ్ కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం

**- జిల్లా ఎన్నికల అధికారి హనుమంతరావు.**

**( యాదాద్రి భువనగిరి బ్యూరో) ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య:**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ లతో ప్రమాణ స్వీకరణ ఈ నెల 16 న చేయించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రోజు కలెక్టరేట్ లోని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గారి చాంబర్లో మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లో బాగంగా ఎన్నికైన వార్డ్ కౌన్సిలర్లు కలిసి చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికకై ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 16 న ప్రమాణస్వీకారం చేయనున్న వార్డు కౌన్సిలర్ల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని , వార్డు కౌన్సిల్స్ మొత్తం ప్రమాణ స్వీకారం చేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం సమయ పాలన పాటించి ఉదయం 11 గంటలకు అందరూ సభ్యులు ఎన్నికైన వార్డు కౌన్సిలర్స్ ప్రమాణ స్వీకారం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రొసీజర్ ప్రకారం నిర్వహించాలని సూచన చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. మంచి వాతావరణంలో మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించి ప్రమాణ స్వీకారం చేయాలని పేర్కొన్నారు. ఎన్నిక కై ఆథరైజ్ గా ఒక్కొక్క మున్సిపాలిటీకి ఒక్కొక అధికారిని



నియమించడం జరిగిందని, భువనగిరి మున్సిపాలిటీ ఆర్థరైజ్డ్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి , పోచంపల్లి మున్సిపాలిటీ కి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీకి సంబంధించి ఆర్డీఓ కృష్ణారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీకి ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మోత్కూర్ మున్సిపాలిటీకి సంబంధించి అడిషనల్ డిఆర్డిఓ సురేష్ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

**ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం తుక్కాపురం స్టేజి నుండి రహీంఖాన్ పేట, ఖప్రాయపల్లి, మోత్కూరు వరకు రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుక్కాపురం కాప్రాయపల్లి మధ్యన రోడ్డు నిర్మాణం మధ్యలో వదిలేసి గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ఆలేరుఎమ్మెల్యే గొంగిడి సునీత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు మంజూరు కాగా గత మూడు సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం పనులు నత్త నడకన సాగుతోందని ఇప్పటికే ఈ మార్గంలో అనేక ప్రమాదాలు జరిగే ప్రజలు కాళ్లు చేతులు విరిగి ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఈ మార్గంలో ప్రమాదానికి గురై పోతిరెడ్డిపల్లికి చెందిన మక్తల నవీను ప్రాణాలు కోల్పోయాడని, అదేవిధంగా హైదరాబాద్ కు సంబంధించిన ప్రయాణికులకు కాళ్లు చేతులు విరిగాయని ఈ ప్రాంతం గుండా వందలాది వాహనాలు, ప్రయాణికులు వాహనదారులు ప్రయాణిస్తున్నారని కానీ బస్సుల్లో వాహనాల్లో ప్రయాణించడంలో కుదుపులకు అనేకమందికి నడుములు పట్టేసి గాయాలపాలైతున్నారని నరక కూపంగా మారిన తుక్కాపురం స్టేజి నుండి రహీం ఖాన్ పేట వరకు రోడ్డు అతుకుల గతుకులతో గుంతల మయంగా మారిందన్నారు, అదేవిధంగా వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని



ఇప్పటికైనాఇప్పుడు ఉన్నటువంటి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తక్షణమే పట్టించుకోని రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుక్కాపురం స్టేజి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ ఆందోళన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, రైతు సంఘం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి మహేష్ కే రాము కుమార్ ఏ వెంకన్న బుగ్గ రాములు శ్రీశైలం సత్తయ్య ఆ మార్గం గుండా వెళ్లే ప్రయాణికులు పాల్గొని రాస్తారోకోని నిర్వహించారు.






# మోత్కూరు మున్సిపల్ ఫలితాల్లో మహిళలదే పై చేయి.

**మోత్కూరు ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య ):**





**మోత్కూరు మున్సిపల్ ఎన్నికల్లో మహిళ కౌన్సిలర్ అభ్యర్థులు అగ్రస్థానంలో నిలిచారు. ఈ మున్సిపల్ పరిధిలో 12 వార్డులలో. ఉండగా కాంగ్రెస్ నుంచి 5 బారాస నుంచి 1 స్వతంత్ర అభ్యర్థిగా 1 గెలుపొందారు. 12వార్డులలో 7మంది మహిళలు కౌన్సిలర్ అభ్యర్థులుగా గెలుపొందారు. మహిళ అన్ని రంగాలలో రాణించాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడంతో ఈ మున్సిపల్ లో 50% పైగా మహిళ కౌన్సిలర్ అభ్యర్థులు అగ్రస్థానంలో ఉండటం విశేషం.**

# మున్సిపల్ చైర్మన్ ల ఎంపిక లో అన్ని పార్టీలు సామాజిక న్యాయం పాటించాలి

- కౌన్సిలర్లు బీసీలు అయితే.. చైర్మన్ లుగా అగ్రకులాలకు అవకాశం కల్పిస్తే సహించేది లేదు.
- జనరల్ స్థానాలు అంటే రెడ్డి, రావులకు రిజర్వేషన్ కాదు.
- యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్.



**( యాదాద్రి భువనగిరి బ్యూరో ) ఫిబ్రవరి 14 వార్తా వేదిక సూర్య :**

మున్సిపల్ ఎన్నికల జనరల్ స్థానాలలో మున్సిపల్ చైర్మన్ లుగా బీసీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశం ప్రధానంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జాజుల మాట్లాడారు. జనరల్ స్థానాలలో బీసీలు అత్యధిక సంఖ్యలో గెలవడం బీసీల ఐక్యతకు నిదర్శనం మున్సిపల్ ఎన్నికలలో 60 శాతం బీసీలే గెలవడం అభినందనీయం మున్సిపల్ చైర్మన్ లుగా, మేయర్ లు గా 60 శాతం బీసీలకు ఇవ్వాల్సిందే నని అన్నారు. కాంగ్రెస్ 60, టిఆర్ఎస్ 10 చైర్మన్ స్థానాలు బీసీలకు కట్టబెట్టాలి అని డిమాండ్ చేశారు. మెజార్టీగా 60 శాతం బీసీలు కౌన్సిలర్ గా, కార్పొరేటర్ గా ఎన్నికైతే.. దామాషా ప్రకారం 60 శాతం చైర్మన్ లు బీసీలకు ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు. ఎవరి వాటా వాళ్లకు దక్కలన్న రాహుల్ గాంధీ సూత్రాన్ని కాంగ్రెస్ అమలు చేయాలి. అగ్రకుల ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గలలో తమ సొంత కులనేతలకు చైర్మన్ లుగా అవకాశం కల్పించాలని చూస్తే సహించశీ అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

**భువనగిరి మున్సిపల్ చైర్మన్ గా బిసిలకు ఇవ్వాల్సిందే**

చాలా నియోజకవర్గాల్లో ఒకటి రెండు అగ్రకులాలు గెలిచిన చోట మున్సిపల్ చైర్మన్ లుగా వారికి అవకాశం కల్పించాలని చూస్తే ఆ ఎమ్మెల్యేలను బీసీ ద్రోహులుగా ప్రకటిస్తాం అని హెచ్చరించారు ఈనెల 16వ తేదీన రాష్ట్రంలో జరగనున్న 116 మున్సిపల్ చైర్మన్ లు, ఏడు కార్పొరేషన్ మేయర్ ఎన్నికలలో రాష్ట్రంలోని అన్ని పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం చైర్మన్ లుగా అవకాశం కల్పించి సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు అంతా కలిసి మెజార్టీగా 85% విజయం సాధించారని, అగ్రకులాలు అన్ని పార్టీల్లో కలిపి 15% విజయం సాధించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ సుమారు 85 మున్సిపాలిటీలలో, టిఆర్ఎస్ పార్టీ 15 మున్సిపాలిటీలలో, బిజెపి 2 ఎంఐఎం ఒకటి అందులో 14 విజయం సాధించారని, కాంగ్రెస్ బీసీలకు 60 మున్సిపల్ చైర్మన్ లుగా, టిఆర్ఎస్ 10 చైర్మన్లుగా, బీసీలకు అవకాశం కల్పించాలని అలాగే 7 మేయర్ ఎంపికలలో బీసీలకు నాలుగు మేయర్ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కులగణలో బీసీలు 56% పైగా ఉన్నారని తేలిపోయిందని జనాభా ప్రకారం మేయర్ లుగా, మున్సిపల్ చైర్మన్ లుగా, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ ఉన్నచోట బీసీలకు వైస్ చైర్మన్, డిప్యూటీ మేయర్ గా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జనరల్ స్థానాలు అనగానే కేవలం రెడ్డి, రావులకే రిజర్వేషన్ అయినట్టు చూస్తున్నారని, రాష్ట్రంలో చాలా మున్సిపాలిటీలలో 90% బడుగులకు చెందిన కౌన్సిలర్లు గెలుపొందితే, ఒక్కరు ఇద్దరు ముగ్గురే అగ్రకులాలు గెలిచారని, 90 శాతం ఉన్న వారిని కాదని 9% ఉన్న అగ్రకులాలకు మున్సిపల్ చైర్మన్ లుగా అన్యాయంగా కట్టబెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు రాష్ట్రంలో చాలామంది అగ్రకుల ఎమ్మెల్యేలు తమ సామాజిక వర్గానికి సంబంధించిన వారు ఒకరిద్దరు గెలిచిన వారిని మున్సిపల్ చైర్మన్గా చేయాలని విఫల ప్రయత్నం చేస్తున్నారని కానీ వాళ్ళ ఆటలు సాగనివ్వమని, ఈ దామాషా పద్ధతిలో ఎవరి వాటా వారికే తగ్గాలన్న రాహుల్ గాంధీ సూత్రాన్ని మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి లు వెంటనే జోక్యం చేసుకొని సామాజిక న్యాయం పాటించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు బీసీలకు అన్యాయం చేసే పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటించి వారి కార్యాలయాలను ముట్టడిస్తామని ఎమ్మెల్యేలు అన్యాయం చేస్తే వారిని బీసీ జాతి ద్రోహులుగా ప్రకటించి వచ్చే ఎన్నికలలో బీసీల ఓటును వారికి లేకుండా రాజకీయ భూస్థాపితం చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా భువనగిరి మున్సిపల్ ఎన్నికలలో 35 వార్డులలో ఒక్క రెడ్డి తప్ప మిగతా 34 చోట్ల బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ అభ్యర్థుల విజయం సాధించారని కానీ స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి బీసీలకు కాదని ఒక్క రే గెలిచిన రెడ్డికి అవకాశం ఇవ్వాలని చూస్తున్నారని తెలుస్తుందని ఇదే గనక జరిగితే అనిల్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భువనగిరి గడ్డ నుంచి తరిమికొడతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, కార్యనిర్వాక అధ్యక్షులు బాబురావు, నియోజకవర్గ అధ్యక్షులు సాబన్ కార్ వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ రాష్ట్ర నాయకులు బత్తిని రాజు గౌడ్, జాజుల లింగం, వెంకన్న, రమేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, ఇంద్రం రజక, భువనగిరి మండల అధ్యక్షులు జిన్న మల్లేష్ ముదిరాజ్ , యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు అశోక చారి, మోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఓటమి నేడు సానుభూతి పవనాలు.

## 5వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా అనురాధ ఘనవిజయం.

**మోత్కూరు: ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య) :**



మోత్కూరు మున్సిపాలిటీలో 5వ వార్డులో గత మున్సిపల్ ఎన్నికల్లో బారాస పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన మొగుళ్ళ అనురాధ ,శ్రీనివాస్ రెడ్డి ఈసారి జనరల్ మహిళ కోటాలో స్వతంత్ర అభ్యర్థిగా (కుర్చీ) గుర్తుతో పోటీ చేసి సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కోక రేణుక, బిక్షం పై 55 ఓట్ల మెజార్టీ తో గెలుపొందారు. గత ఎన్నికల్లో బారాస పక్షాన పోటీ చేసి ఓడిపోయారు. ఇదే వార్డులో తాజా మాజీ కౌన్సిలర్ మలిపెద్ది రజిత సైతం స్వతంత్ర అభ్యర్థిగా (ఆపిల్) గుర్తు పై పోటీ చేసింది. కాంగ్రెస్ పార్టీ సీపీఐతో పొత్తులో భాగంగా మొగుళ్ళ స్వాతి శేఖర్ రెడ్డి పోటీ చేశారు. ఈ వార్డులో బీఆర్ఎస్ కి 258 ఓట్లు రాగా, సీపీఐ అభ్యర్థి కి 257 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి రజితకు 179 ఓట్లు రాగా, అనురాధకి 313 ఓట్లు వచ్చాయి. 55 ఓట్ల మెజార్టీ సాధించడంతో ప్రధాన పార్టీల నాయకులు అవాక్కయ్యారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇరువురు ఆహ్వానించి పార్టీ టిక్కెట్ ఇస్తామన్నా తాము కాదనుకొని స్వతంత్ర అభ్యర్థులుగా నిలిచామని, తమకు వార్డు ప్రజలు గొప్ప తీర్పు ఇచ్చి కౌన్సిలర్ పదవి ఇచ్చారని ప్రజల రుణం తీర్చుకుంటానని అనురాధ పేర్కొన్నారు.

# ఆ రెండు వార్డులలో చిత్రం భళారే విచిత్రం.

- నాడు కాంగ్రెస్ నేడు బారాస.
- అధికార పార్టీలకు ప్రజల వ్యతిరేక తీర్పు

**మోత్కూరు: ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య ):**




మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప 3,4 వార్డులలో చిత్రం భళారే.. విచిత్రంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో నాడు బారాస పార్టీ అధికారంలో ఉండగా.. 3,4 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు ఎర్రబెల్లి మల్లమ్మ, యాదయ్య, లెంకల సుజాత,వేణులు గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. ఈ దఫా బీఆర్ఎస్ అభ్యర్థులు సుల్తాన్ స్వామి, కొండ శోభ సోశీమల్లు గెలుపొందారు. నాడు, నేడు కొండగడప ప్రజలు అధికార పార్టీలకు మాత్రం వ్యతిరేక తీర్పు.. ప్రతిపక్షాలకు అనుకూల తీర్పు ఇవ్వడంతో రాజకీయ విశ్లేషకులు అయోమయంలో పడ్డారు. ఏది ఏమైనప్పటికీ.. కొండగడపలో ఏకంగా బారాస పార్టీ 2 సీట్లు సాధించడంతో కొండగడప గులాభీ శ్రేణులకు బలాన్ని ఇచ్చింది. వీటికి తోడు 10వార్డు అభ్యర్థిగా నల్ల మధు గులాబీ జెండాఎగుర వేశారు...రానున్న రోజుల్లో మున్సిపల్ లో బారాస ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించనుంది.

# నేడు శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి కళ్యాణం.

**మోత్కూరు: ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య )**

మండలంలోని ముశిపట్ల గ్రామంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అభిషేకం, రాత్రి 10::30 నిమిషాలకు రామలింగేశ్వర స్వామి కళ్యాణం, 16 ఉదయం 6గంటలకు అగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్, ఆ గ్రామ సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కళ్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు 1016 రూపాయలు చెల్లించి తమ పేర్లను 9985552545 , 7702814588, , 9100386261 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ ఏర్పాటు చేయాలి

## -మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు

**ఆత్మకూరు (ఎం), ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులు చాలా వరకు బీద పరిస్థితి లో వున్నారు ఐదు సంవత్సరాలు పాలకులుగా పరిపాలన సాగించి గ్రామాల అభివృద్ధికి ప్రజల అభివృద్ధికి కృషి చేసి పదవి విరమణ తర్వాత కూడ వారి ప్రాంతం అభివృద్ధికే కృషిచేస్తున్నారు. ఎక్కువ శాతం బీద పరిస్థితి లో వున్నారు. స్థానిక సంస్థలలో సర్పంచ్ యంపిటీసి జెడ్పీటీసీ మండల పరిషత్ అధ్యక్షులు జిల్లా పరిషత్ అధ్యక్షులు గా పనిచేసారు. జిల్లా పరిషత్ అధ్యక్షులకు స్టేట్ మినిస్టర్ క్యాడర్ వున్నప్పటికి పెన్షన్ లేదు కావున స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధులకు పెన్షన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ను కోరుతున్నాం అని ఆయన వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రజ పరిషత్ అధ్యక్షులు ప్రతికంఠం హేమలత రాజు మాజీ సర్పంచ్ లు ఎరుకల స్వామి బి.లక్ష్మమ్మ,జోగు పిచ్చమ్మ యాస బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తుక్కుగూడ జిహెచ్ఎంసి బిజెపి యువ నాయకుడు జాపాల సుధాకర్

**మహేశ్వరం, ఫిబ్రవరి 14, వార్త వేదిక సూర్య**





ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి హిందూ టైగర్ యోగి ఆదిత్యనాథ్ ని తుక్కుగూడ జిహెచ్ఎంసి బిజెపి యువ నాయకుడు జాపాల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరప్రదేశ్ జైళ్ల శాఖ మంత్రి సివిల్ డిఫెన్స్ పోలీస్ శాఖ మంత్రి, ధర్మవీర్ ప్రజాపతి ని కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాన్ని అందజేయడం జరిగింది. తెలంగాణ నుండి వచ్చామని మీలాంటి మహానుభావుడిని దర్శించుకోవడం మా భాగ్యమని అయోధ్య రామయ్య తో పాటు మరో హనుమంతుడిని అంటే యోగి ని కూడా దర్శించుకున్నామని యోగి తో విన్నవించడం జరిగింది. నా జీవితంలో మీలాంటి మహానుభావుడిని కలవడం మా అదృష్టమని యోగి తో దాదాపు 20 నిమిషాలు గడిపిన సందర్భం జీవితంలో మరువలేనిదని జాపాల సుధాకర్ పత్రిక ముఖంగా తెలిపారు.

## మహేశ్వరం గ్రామ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు.
## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్య ముదిరాజ్

**మహేశ్వరం ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య:**



తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మహేశ్వరం గ్రామ పంచాయతీ పాలకవర్గానికి మహాశివరాత్రి శుభాకాంక్షలు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రయ్య మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి కుటుంబంలో శివరాత్రి జాగారం చేసి సాయంత్రం అందుబాటులో శివగంగ రాజరాజేశ్వరి టెంపుల్ కానీ అలాగే అందుబాటులో ఉన్న ఏ పుణ్యక్షేత్రం కైనా వెళ్లి ఉపవాస దీక్ష విరమించుకొని ఆ శివుని ఆశీస్సులు మీపై ఎల్లప్పుడూ ఉండాలని గ్రామస్తులందరూ ఆరోగ్యవంతంగా, సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ దేవున్నికోరుకుంటున్నాను, మహేశ్వరం గ్రామంలో శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రతి ఒక్కరు హాజరై స్వామి వారి దర్శనం చేసుకుని వెళాలని తెలియజేశారు,

మీ కర్రేళ్ల చంద్రయ్య ముదిరాజ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేశ్వరం..

## గ్రామం లో మాపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు ఖబర్దార్.

### సిరిగిరిపురం గ్రామ సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శ్రీను.

**మహేశ్వరం ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య**

మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలో గత కొన్ని రోజుల నుండి గ్రామంలో కొంతమంది వ్యక్తులు గ్రామ సర్పంచ్ కృష్ణవేణి శ్రీను, గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతుంటే అడ్డు పడుతూ ,మాకు సంబంధం లేని విషయాలలో కావాలని తప్పుడు ప్రచారం చేయడం న్యూస్ పేపర్ కి ఇవ్వడం, నన్ను గానీ మా భర్త శీను ను గాని మా పాలకమండలినీ గాని బ్లాక్ మెయిల్ చేయడం, ఇలాంటి ఎన్నో మాపై తప్పుడు ప్రచారం చేయడం, వాళ్లకు మేము ఒక్కటే చెప్పాలి అనుకుంటున్న ముందు మాజీ సర్పంచ్ కాసుల సురేష్, గత ఐదు సంవత్సరాలు సర్పంచ్ గా ఉండి సిరిగిరి పురం గ్రామానికి ఏమీ అభివృద్ధి పనులు చేశావు, మళ్లీ ఎలక్షన్లో మా పై సర్పంచ్ గా పోటీ చేసి ఒక వార్డ్ మెంబర్ గా కూడా గెలవలేదు అలాంటిది మేము సర్పంచ్ గా గెలిచిన తర్వాత చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నావ్ కానీ ఇకనుండి ఆ బుద్ధి మానుకో ఎందుకంటే గతంలో మంచి పేరు ఉంది మాజీ సర్పంచ్గా ఉన్నారు, ఇప్పటికైనా మాపై పాలకవర్గం పై తప్పుడు ప్రచారాలు మానుకొని ఉండాలని హెచ్చరిస్తున్నాం. సిరిగిరి పురం గ్రామ సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శ్రీను.



## సేవ బలం, స్నేహబలంతో ఎన్నికల్లో విజయం

**- మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ లపై అనూహ్య గెలుపు.**

**గుమ్మడిదల, వార్తా వేదిక సూర్య న్యూస్:**




చేసిన సేవలు అండగా నిలుస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. గుమ్మడిదల మున్సిపల్ ఎన్నికల్లో స్నేహితుల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవడమే కాకుండా ఏకంగా గెలుపొందడం గుమ్మడిదల రాజకీయాలలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. గుమ్మడిదల మున్సిపల్ 14 వార్డు స్వతంత్ర అభ్యర్థిగా స్నేహితులంతా కలిసి కత్తుల రమేష్ అనే వ్యక్తిని బరిలో దింపారు. కత్తుల రమేష్ ఆది నుంచి మున్సిపల్ ప్రజలకు కష్ట సుఖాలలో అండగా ఉంటాడనే పేరు ఉంది. పైగా స్నేహితుల సంపూర్ణ మద్దతు కూడా ఉంది. మారుతున్న రాజకీయాలకు భిన్నంగా పోటీలోకి దిగడమే కాకుండా ఏకంగా ఓ మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ అభ్యర్థులను ఓడించి వేనోళ్ల పొగిడించుకున్నారు. గతంలోనే వార్డు సభ్యుడుగా సేవలందించిన కత్తుల రమేష్ మరో మారు కేవలం తన సేవలే పరమావధిగా భావించిన ప్రజలు మరోసారి కౌన్సిలర్ గా పట్టాభిషేకం చేశారు. తనపై నమ్మకంతో కౌన్సిలర్ గా అవకాశం కల్పించిన వార్డు ప్రజలకు, ఆది నుంచి వెన్నుతన్నుగా నిలిచిన స్నేహ బృందానికి కత్తుల రమేష్ ధన్యవాదాలు తెలిపారు. స్వార్థపూరిత రాజకీయాలు కాకుండా వార్డు అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని కత్తుల రమేష్ వార్డు ప్రజలకు భరోసా కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మృతదేహం

### కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న మహేశ్వరం పోలీసులు

**మహేశ్వరం ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య**



మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 11 న రాత్రి 11:00 గంటలకు సమయంలో శ్రీశైలం హైవే, బి టి ఆర్ మా కు, వన్ గేట్ సమీపంలో వ్యక్తి పడి ఉండడంతో, జి శ్రీశైలం గౌడ్ పి సి-128,39.ఎప్ సి. సి మహేశ్వరం పి ఎస్ నుండి ఫిర్యాదు అందింది, 100కు డయల్ చేసి వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలియజేశారు, మహేశ్వరం పోలీసులు పెట్రోలింగ్ వన్ విధులు నిర్వహిస్తున్న 100 డయల్ ద్వారా వచ్చిన ప్రకారం వెంటనే పిసి శ్రీశైలం గౌడ్, డ్రైవర్ కుమార్ హెచ్ జి -2061. తో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు, సంఘటన స్థలంలో సుమారు 35 నుంచి 40, సంవత్సరాల వయసుగల గుర్తు తెలియని పురుషుడు రోడ్డుపై పడి ఉన్నట్లు గమనించారు, అనంతరం అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకొని అక్కడ పడిపోయిన వ్యక్తిని పరీక్షించగా వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు, మృతి చెందిన వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తిగా నిర్ధాకరించారు, మిత్రుడు వివరాలు : వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు, వర్ణం : సాధారణ కంప్లికేషన్, దుస్తులు బ్లూ కలర్ టీ షర్ట్, ఎత్తు సుమారు 5 అడుగులు, మేరకు మహేశ్వరం పోలీస్ స్టేషన్ సి ఆర్ నెంబర్, 70/2026గా బ/సెకండ్ 106 (1) బిఎల్ఎస్ కింద కేసు నమోదు చేయబడింది, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మహేశ్వరం పోలీసులు, మృతుడు వివరాలు తెలిసినవారు లేదా గుర్తించగలిగిన వారు మహేశ్వరం పోలీస్ స్టేషన్ సంప్రదించగలరని ఎస్సై రాఘవేందర్ రావు తెలిపారు.

## అనాధ ఆశ్రమ గూడు కోసం కేఎల్ఆర్ 10 లక్షలు విరాళం.

**మాతృదేవోభవ అనాధశ్రమానికి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేయూత.**

**మహేశ్వరం ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య**

నాదర్ గుల్ గ్రామంలో సమస్యలపై పర్యటన అనాధలకు పండ్లు పంపిణీ చేసిన కె ఎల్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్,అభాగ్యుల గూడు కోసం పేదల పెన్నిధి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మానవత్వం చాటుకున్నారు. జిహెచ్ఎంసి పరిధి నాదర్ గుల్ డివిజన్ పరిధిలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కేఎల్ఆర్ , క్షేత్రస్థాయిలో పర్యటించారు.నాదర్ గుల్ లోని మాతృదేవోభవ అనాధ ఆశ్రమాన్ని సందర్శించారు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వారిని, అభాగ్యులను చేరదీస్తున్న ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరిని అభినందించారు. నూతన భవన నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. కె.ఎల్.ఆర్ ట్రస్ట్ నుంచి రూ. 10లక్షల భవన నిర్మాణానికి మెటీరియల్ ఇస్తామని ఛైర్మన్ లక్ష్మారెడ్డి, చెప్పటంతో నాదర్ గుల్ కాంగ్రెస్ నేతలు, అనాధాశ్రమ నిర్వాహకులు, స్థానిక ప్రజలు హర్షద్వానాలు వ్యక్తం చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేసిన తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాలు, పేదలు, అభాగ్యులకు సేవ చేసేందుకే కెఎన్ఆర్ ,ట్రస్ట్ స్థాపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాదర్ గుల్ డివిజన్ నాయకులు, ఆశ్రమ నిర్వాహకులు, అభాగ్యులు, స్థానికులు పాల్గొని లక్ష్మారెడ్డికి,ఘన స్వాగతం పలికారు.



## గ్రీన్ హోమ్స్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి

**నాదర్ గుల్ అక్రమ కట్టడాలపై కమిషనర్ కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**



**మహేశ్వరం ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య**

గత కార్పొరేటర్లు, పాలకుల నిర్వాహణలో నాదర్ గుల్ డివిజన్లలో విపరీతంగా అక్రమ కట్టడాలను ప్రోత్సాహించారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఆగ్రహం వ్యక్తం చేశారు. నాదర్ గుల్ గ్రామంలో గ్రీన్ హోమ్స్ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ సరస్వతికి పలు విజ్ఞప్తులు చేశారు, కాలనీ వాసులు. బిల్డర్ సహా అక్రమ నిర్మాణాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, లక్ష్మారెడ్డి. వానాకాలంలో ఇండ్ల మధ్యలో పారే వరద నీరుతో ముప్పు పొంచి ఉందని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.ప్రజలకు, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను చెప్పారు.నాదర్ గుల్ లో అక్రమ లేఅవుట్స్, నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కె.ఎల్.ఆర్, అధికారుకులను ఫోన్లో సంప్రదించారు.జిహెచ్ఎంసి డివిజన్ కాలనీ సమస్యలపై వెంటనే నివేదికలు తయారు చేయాలని అధికారులకు తెలిపారు . ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం నాదర్ గుల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## 13వ వార్డ్ లో యువనేత ఎం.నరేందర్ రెడ్డి విజయం

**గుమ్మడిదల,వార్త వేదిక సూర్య :**



గుమ్మడిదల మున్సిపల్ జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 13వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యువ నాయకుడు ఎం. నరేందర్ రెడ్డి విజయం సాధించాడు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో నలుగురు కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా గుమ్మడిదలలో నరేందర్ రెడ్డి విజయకేతనం ఎగురవేశాడు. నరేందర్ రెడ్డి ప్రజలకు ఆపద్బాంధవుడుగా ఉంటూ, ఆర్థిక సాయం చేస్తూ ప్రజల్లో పేరు సంపాదించాడు. అన్నా అనగానే నేనున్నానని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు నరేందర్ రెడ్డి. తన విజయం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకొంటూ సంబరాలు చేసుకున్నారు.

## విశాల భారతిలో ఘనంగా స్వపరి పాలన దినోత్సవం



**చౌటుప్పల్ ఫిబ్రవరి 14 వార్త వేదిక సూర్య**

చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాల భారతి హైస్కూల్ లో శనివారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ స్వపరి పాలన దినోత్సవం లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాత్రలు నిర్వహిస్తూ తమదైన శైలిలో ప్రతిభా పాఠాలను తరగతి గదిలో బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో తను ఎంచుకున్న స్థానంలోకి ఉన్నతంగా ఎదగాలని, ఉజ్వల భవిష్యత్తుపై నిరంతరం శ్రమించాలని, ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుగా శివ కౌశిక్,గా ఎడ్యుకేషనల్ మినిస్టర్ గా కార్తీక్, కలెక్టర్ గా సుహాని, డిఇఓ గా పుష్ప, ఎంఈఓ శ్రీవాణి, చైర్ పర్సన్ గా లాస్య, శ్రీకాంత్, శివతేజ పాత్రను తమదైన శైలిలో పాత్రలు పోషించారు,విద్యార్థులు వారి ప్రత్యేకతను ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడెల ఆంజనేయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు

# సిపిఎం పార్టీ నీ ఆదరించినందుకు ధన్యవాదాలు.

**- ఎండి పాషా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు.**




**చౌటుప్పల్ ఫిబ్రవరి 14 వార్తా వేదిక సూర్య:**

చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ బలపరిచి నాలుగు స్థానాల్లో సిపిఎం పార్టీ నుండి పోటీ చేయడం జరిగింది. ఆ స్థానాలలో ఆదరించిన ప్రతి ఒక్కరికి చౌటుప్పల్ సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని శనివారం రోజున అమరజీవి కామ్రేడ్ కందాల రంగారెడ్డి స్మారక భవనం నందు నిర్వహించిన సమావేశంలో ఎండి పాషా అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్ ,బండారు నరసింహ, ఉష్కా గులా శ్రీనివాస్, బొడ్డు అంజిరెడ్డి, ఆకుల ధర్మయ్య, గుణమున ఐలయ్య, తూర్పునూరు మల్లేశం, కందగట్ల ఆనంద్, చికూరు ఈ దయ, బొమ్మ కంటి కృష్ణ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, అవ్వరు గోవర్ధన్, ముగుదాల రాములు, బడేటి చంద్రయ్య, పాల్గొనడం జరిగింది.

# కుమ్మర్లు రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో ఎదగాలి.

- కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం.
- రెండో వార్డు కౌన్సిలర్ కు ఘన సన్మానం.



**చౌటుప్పల్ ఫిబ్రవరి 14 వార్తా వేదిక సూర్య:**

కుమ్మర్లు రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో ఎదగాలని కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందిన పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్యను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయంతో పాటు వివిధ రంగాల్లో రాణించి, వృత్తి విద్యలో నైపుణ్యాన్ని చూపిస్తూ మట్టి పాత్రలు వాడే విధంగా కృషి చేయాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడే విధంగా అన్ని రకాల కుమ్మరి మట్టి పాత్రలను వాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వృత్తి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్యను గెలిపించిన లింగోజిగూడెం కుమ్మర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు ఓరుగంటి గోపాల్, ప్రధాన కార్యదర్శి దరుపల్లి ప్రవీణ్, చిన్న కొండూరు సర్పంచ్ తీగుళ్ళ చంద్రయ్య, చౌటుప్పల్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షులు సిలివేరు శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు సిలివేరు నరేష్, ప్రధాన కార్యదర్శి పోలేపల్లి ముత్తయ్య, గౌరవ అధ్యక్షులు చిలువేరు జంగయ్య, యూత్ అధ్యక్షులు పోలేపల్లి నవీన్, వెంకటేష్, తిగుళ్ల నరసింహ, చిలువేరు మంగయ్య, సత్తయ్య, ఊషయ్య, ధనరాజ్, తదితర ఇతర కులస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా వీడ్కోలు పార్టీ



**చౌటుప్పల్ ఫిబ్రవరి 14 వార్తా వేదిక సూర్య:**

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అరవిందో జూనియర్ కళాశాల చైర్మన్ బత్తుల శంకర్ అన్నారు. శనివారం అరవిందో జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్షణాలు ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు అరవిందో జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎప్పటికీ తోడ్పాటు అందిస్తదని అన్నారు. మంచి క్రమశిక్షణతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారు. మీరు ఉన్నత స్థితిలో ఉంటే తల్లిదండ్రులతోపాటు కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపకులు కూడా చాలా సంతోషిస్తారని అన్నారు.ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులు డ్యాన్స్ లతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ వలమల్ల రాజశేఖర్, డైరెక్టర్స్ చిలువేరు దుర్గయ్య, కట్టెల లింగస్వామి అధ్యాపకులు నాగలక్ష్మి, లింగయ్య, సుధాకర్ రెడ్డి, శివప్రసాద్, బాలరాజు, కళ్యాణి, సువర్ణ, మహేష్, శ్రీవాణి, శ్రీదేవి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# లోకసాని శ్రీనివాస్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

**-శ్రీనివాస్ రెడ్డి మృతి బాధాకరం.**
**-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ ఫిబ్రవరి 14, ( వార్త వేదిక సూర్య):-**

డిండి మండలం ఖానాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లోకసాని శ్రీనివాస్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శనివారం ఖానాపూర్ గ్రామంలో శ్రీనివాస్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శ్రీనివాస్ రెడ్డి మృతి బాధాకరం అని ఆయన అన్నారు. పార్టీ పరంగా అండగా ఉంటాం అని ఆయన భరోసా ఇచ్చారు. వారి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు, కృష్ణ రెడ్డి,బోడ్డుపల్లి జయంత్, వెంగళ్ రావు, తదితరులు ఉన్నారు

# శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

**-బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్.**

దేవరకొండ ఫిబ్రవరి 14, ( వార్త వేదిక సూర్య ):-

ప్రతి ఒక్కరూ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పల్లా శ్రీకాంత్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సంకు కొండల్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, వాజిద్ పాషా తదితరులు పాల్గొన్నారు



# ఈనెల 16,17న హలియా పట్టణంలో జరిగే ఏఐఎస్ఎఫ్ నల్గొండ జిల్లా 24 మహాసభలను జయప్రదం చేయండి

**వలమల్ల ఆంజనేయులు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు**

**దేవరకొండ ఫిబ్రవరి 14, ( వార్తా వేదిక సూర్య):-**

దేవరకొండ స్థానిక పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో జరిగిన ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ 19వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులుమాట్లాడుతూపాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు ఎప్పటికప్పుడు ఎండ గడుతూ విద్యార్థుల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతున్నది, ఎఐఎస్ఎఫ్ ఈ తరుణంలో విద్యారంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులకు తెలియపరుస్తూ, విద్యార్థి లోకాన్ని చైతన్య పర్చడం కోసం, విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడానికి 2026 ఫిబ్రవరి 16,17 తేదిలలో రెండు రోజుల పాటు హలియా పట్టణ కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా 24వ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి విద్యార్థి ప్రతినిధులు పాల్గొని జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుంది. ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ మహాసభలలో సామాజిక, రాజకీయ రంగాలలో ప్రముఖులైన మేధావులు పాల్గొనబోతున్నారు అని అయన అన్నారు అనంతరం నూతన డివిజన్ సమితి ని ఎన్నుకోవడం జరిగింది మహాసభ ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యర్ర వినయ్, డివిజన్ వట్టేపు శివ కుమార్,ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భాను, పల్లె చైతన్య,మాతంగి హన్మంత్, కళ్లెం సిద్ధు,ప్రణీత్,వంశీ, సోహెల్, నందు,గాయత్రి, మానస, అంజలీ, సిద్ధు, మహేష్, తదితరులు పాల్గొన్నారు









# బి ఆర్ ఎస్ ఖానాపూర్ గ్రామ శాఖ అధ్యకులు లోకాసాని శ్రీనివాస్ రెడ్డి చిత్ర పటానికి పూలు మాల వేసి నివాళులు అర్పించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్

**దేవరకొండ ఫిబ్రవరి 14, ( వార్త వేదిక సూర్య ):-**

డిండి మండలం బి.ఆర్.ఎస్ ఖానాపూర్ గ్రామ శాఖ అధ్యకులు లోకాసాని శ్రీనివాస్ రెడ్డి గారీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించిన బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి బొడ్డుపల్లి జయంత్. మాజీ జడ్పీటీసీ సభ్యులు రాఘవ చారి బి.ఆర్.ఎస్ పెద్ద తండ మాజీ సర్పంచ్ కట్రావత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# విద్య మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది

**డి.ఎస్.పి శివరాంరెడ్డి**

**నల్లగొండ , ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య )**

నల్లగొండ. సమాజంలో విద్య ఒక్కటేనని అత్యంత స్థానంలో నిలబెట్టేదని ధనం, అధికారం కాదని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాస్ట్ మినిట్ రివిజన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. చదువురాని మనిషి వ్యక్తిత్వం వికసించడమే కాకుండా సమాజాభివృద్ధికి బలమైన పునాది పడుతుందనీ, విద్య ఉన్నచోట అవగాహన ఉంటుందని, అవగాహన ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వచ్చిన అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండి తమ లక్ష్యాలను నెరవేర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్య మనిషికి కేవలం ఉద్యోగ అవకాశాల కోసమే కాదని మంచిని చెడును గుర్తించే వివేకాన్ని కూడా ఇస్తుందని అన్నారు. పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగరావును డిఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా పిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ విద్యతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని విద్య మనిషిని అంధకారంలో నుంచి వెలుగు వైపు నడిపించే మార్గదర్శిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి , ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో గ్రామ గ్రామాన గ్రంథాలయాలు నెలకొల్పాలి

## ఆచార్య లక్ష్మణరావు

**నల్లగొండ , ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య )**



తెలంగాణ గ్రామ గ్రామాన గ్రంథాలయాలు ఏర్పాటు మరియు అభివృద్ధి లో మేధావులు రచయితలు, సాహిత్య కారుల పాత్ర అనే అంశంపై తెలంగాణ గ్రంథాలయ సంఘం మరియుప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల నల్లగొండ గ్రంథాలయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాలలో ఒకరోజు సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య లక్ష్మణరావు , గౌరవ అతిథి డాక్టర్ గోన రెడ్డి , మరొక అతిథి డాక్టర్ బెల్లి యాదయ్య , తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డా. రవికుమార్ చేగోని, గాద వినోద్ రెడ్డి, అతిథులు గా పాల్గొన్నారు. ఆచార్య లక్ష్మణరావు మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామ గ్రామాన గ్రంథాలయాలు నెలకొల్పాలని, గ్రామాలలో వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్నును విధిగా గ్రంథాలయానికి కేటాయించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాలు గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని, స్వచ్ఛందంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. డాక్టర్ గోనారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ డాక్టర్సహాయ సహకారాలు కావాలని ప్రభుత్వాల నుంచి సహకారం అందిస్తేనే గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడతాయని తెలుపుతూ కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ తరపున గ్రంథాలలకు సహకారం అందిస్తామని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం పాలసీలో చదివే అలవాటు పెంపొందింపజేయాలని నివేదిక తెలియజేసింది అన్నారు. ఆచార్య బెల్లి యాదయ్య మాట్లాడుతూ ఉన్నతుల సహకారంతో స్వచ్ఛంద గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని, వీధి వీధినా గ్రంథాలయాలు, కమ్యూనిటీ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని గ్రంథాలయ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. గ్రంథాలయాలు నాలుగు కాలాలపాటు వర్ధిల్లాలి అంటే పాఠశాలలలో పౌర గ్రంథాలయాలలో క్రింద పాలకుల నియామకం చేపట్టాలి. డా. రవి కుమార్ చేగొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం చైతన్యవంతమైనదని ఈ ప్రాంతంలో గ్రంథాలయాలు స్వాతంత్రానికి ముందు ఏర్పాటు చేయబడ్డమని అలాంటి గ్రంథాలయాల ఏర్పాటు సంస్కృతి ఇప్పుడు పునర్వికాసం చెందాలని కోరారు. కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ రాజారామ్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థినీలలో తరచుగా గ్రంథాలయాల వినియోగం చేసుకోవాలని తద్వారా తమ యొక్క జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తెలంగాణలో గ్రంథాలయ ఉద్యమం బలోపేతం అవుతున్నదని దానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని, పాఠశాలల్లో కళాశాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తూ యువతలో పుస్తక పటనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవి మూనాస వెంకట్, సుధారాణి, బైరెడ్డి కృష్ణారెడ్డి, మే రెడ్డి యాదగిరి రెడ్డి, ఎలికట్ట శంకర్, డాక్టర్ హస్సేనా, అంబటి వెంకన్న, కస్తూరి ప్రభాకర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి వట్టికూటి వెంకటేశ్వర్లు, పగడాల నరేందర్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్పతి, మోత్కూరు శ్రీనివాస్, పడిశాల నాగరాజు, బుచ్చిరాములు, రాజగౌడ్ , పల్లె సతీష్, డా. బేబీ కుంజ, భావన ఋషి రచయితలు కవులు , కళాకారులు గ్రంథ పాలకులు, గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**నల్లగొండ , ఫిబ్రవరి 14 (వార్తా వేదిక సూర్య )**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఒక్కరోజు స్వపరిపాలన కార్యక్రమాలు దోహదపడతాయని సప్తగిరి పాఠశాల డైరెక్టర్ బొల్లం లింగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సప్తగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, డాక్టర్లుగా ప్రజా ప్రతినిధులుగా చక్కటి అభినయాన్ని హుందాతనాన్ని ప్రదర్శించారు. అనంతరం అ పాఠశాల నుండి గడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పూలే విగ్రహానికి, తెలంగాణ మలి దశ తొలి అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లింగయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విధులను బాధ్యతలను చక్కగా నిర్వహించి భావి భారత పౌరులుగా తాము ఏమి అవ్వాలనుకున్నారో ఆ పాత్రలను ఉన్నతంగా వ్యవహరించి నిరూపించారని తెలిపారు .విద్యాశాఖ మంత్రి గా నేహా శ్రీ ,ఎమ్మెల్యేలు కే మోహన్, సాయి తరుణ్, సాయికిరణ్, భీమ్, జిల్లా కలెక్టర్ పూజ, జిల్లా ఎస్పీ వంశీ, డీఈవో రామ్ చరణ్, ఎంఈవో ప్రసన్న పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుందనీ అన్నారు. మా పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పిస్తే ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది విజ్ఞానవంతులుగా చేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయుల వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైదులు, ఉపాధ్యాయులు మూర్తి, నరసింహ, శంకర్, గౌస్, శ్రీకాంత్, ఫాహిమా, సరిత, ధనలక్ష్మి, కళ్యాణి, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.



# మహా శివరాత్రి సందర్భంగా సీఎం శుభాకాంక్షలు

- రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి శుభాభినందనలు.
- సుభిక్ష తెలంగాణ కోసం మహాదేవునికి ప్రార్ధనలు.
- భక్తులకు ఆయురారోగ్యాలకై ఆకాంక్ష.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య):**




మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మహాదేవునిని ప్రార్ధించారు. మహా శివరాత్రి ఉపవాస దీక్షలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులందరికీ శివయ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. భక్తి, విశ్వాసాలతో నిర్వహించే ఈ పర్వదినం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులకు, సేవలందిస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. శాంతి, సామరస్యాలతో పండుగను జరుపుకోవాలని ప్రజలను ముఖ్యమంత్రి కోరారు.

# పురపోరులో పొంగులేటి మ్యాజిక్ 70 శాతం సక్సెస్ రేటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య ):**

- 249 వార్డుల్లో ప్రచారం 174 చోట్ల హస్తం జెండా
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌లో కాంగ్రెస్ ప్రభంజనం
- శీనన్న వ్యూహంతో ప్రత్యర్థుల కోటలు బద్దలు



మున్సిపల్ ఎన్నికల కురుక్షేత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అజేయ శక్తిగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించిన బాధ్యతను సవాలుగా తీసుకుని కేవలం పది రోజుల్లో 249 వార్డుల్లో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఆ ప్రచార ఫలితంగా 174 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడంతో సుమారు 70 శాతం సక్సెస్ రేటు నమోదు కావడం విశేషం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 24 చోట్ల కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 22 స్థానాలు గెలుచుకోగా, కల్లూరులో 12, సత్తుపల్లిలో 17 వార్డులను హస్తం ఖాతాలో వేసుకున్నారు. ఇల్లందులో 19, అశ్వారావుపేటలో 17 స్థానాల్లో గెలిచి జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పట్టు బలపడినట్లు స్పష్టం అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా శీనన్న వ్యూహం ఫలించింది. భూపాలపల్లిలో 16 వార్డులు గెలుచుకోగా, పరకాలలో 13, స్టేషన్ ఘన్‌పూర్‌లో 13 స్థానాలు సాధించి కాంగ్రెస్ ప్రాభవాన్ని చాటింది. ప్రత్యర్థుల బలమైన కోటలుగా భావించిన ప్రాంతాల్లోనూ పార్టీ విజయపథంలో దూసుకెళ్లడం గమనార్హం. మొత్తంగా మంత్రి పొంగులేటి ప్రచారం నిర్వహించిన 249 వార్డుల్లో 174 స్థానాల్లో విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి ఫలితమే ఈ విజయమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఫలితాలతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ పురపాలికల్లో కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించినట్లు స్పష్టం అయింది.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై జనసేన ప్రెస్ మీట్

- ♦ రెండు చోట్ల విజయంతో బోణీ.
- ♦ మూడొందలకు పైగా అభ్యర్థుల పోటీ.
- ♦ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై దృష్టి.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 (వార్త వేదిక సూర్య ):**




తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యిన అనంతరం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడొందలకు పైగా జనసేన అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. మంచిర్యాల్ కార్పొరేషన్ 34వ డివిజన్‌లో జనసేన అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో గెలిచారని, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు 29 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని వెల్లడించారు. తెలంగాణలో జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తక్కువ సమయంలో పార్టీ శ్రేణులు, నాయకులు, వీర మహిళలు ఎంతో కష్టపడి పని చేశారని, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు చోట్ల సాధించిన విజయంతో రాష్ట్రంలో పార్టీ బోణీ కొట్టిందని పేర్కొన్నారు. తెలంగాణ ఇంచార్జి నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులకు, బలంగా పనిచేసిన నాయకులకు, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో మరింత బలంగా పోటీ చేస్తామని చెప్పారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రాదారం రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాష్ట్ర నాయకత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఆర్కే సాగర్, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పార్టీని గుర్తించి ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీర మహిళ చైర్మన్ కావ్య మండపాకతో పాటు ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ నల్లమల కమలాదేవి కన్నుమూత

- సీపీఐ అగ్రనేత గిరిప్రసాద్ సతీమణి మృతి.
- జూబ్లీహిల్స్‌లో భౌతిక కాయానికి నివాళులు.
- మహాప్రస్థానంలో సాయంత్రం అంత్యక్రియలు.
- కూనంనేని సంతాపం.

**హైదరాబాద్, 14 ఫిబ్రవరి (వార్త వేదిక సూర్య ):**



సీపీఐ అగ్రనాయకులు కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్ సతీమణి నల్లమల కమలాదేవి (87) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణంతో వామపక్ష వర్గాల్లో విషాదం నెలకొంది. నల్లమల కమలాదేవి భౌతిక కాయాన్ని ఇవాళ సాయంత్రం 4 గంటల వరకు జూబ్లీహిల్స్‌లోని ఆమె పెద్ద కుమార్తె నివాసంలో సందర్శనార్థం ఉంచనున్నారు. బంధువులు, పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు నివాళులు అర్పించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కమలాదేవి మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. ఆమె తన భర్త గిరిప్రసాద్ పోరాటంలో అనునిత్యం భాగస్వామ్యమై ఆయనకు అండగా నిలిచారని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమాలకు మౌనంగా తోడ్పాటునందించిన వ్యక్తిగా కమలాదేవిని పలువురు స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు.

# సినిమాలు లేవు..

## కానీ సోషల్ మీడియాలో ఫుల్ బిజీగా ప్రణీత సుభాష్



నటి ప్రణీత సుభాష్ తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కథానాయికగా నిలిచింది. 'ఏం పిల్లో ఏం పిల్లడో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ తొలి చిత్రంతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. సొగసుతో పాటు సహజమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని తక్కువ సమయంలోనే మంచి అవకాశాలను అందుకుంది. ఆ తర్వాత నటుడు సిద్ధార్థ్ సరసన నటించిన 'బావ' చిత్రం ఆమెకు మరింత పేరు తీసుకొచ్చింది. ఆ చిత్ర విజయంతో వరుసగా అవకాశాలు రావడంతో ప్రణీత తెలుగు చిత్రాల్లో బిజీగా మారింది. కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక కథలతో కూడిన సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరైంది. అందం, అభినయం రెండింటినీ సమతూకంగా చూపిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. తరువాత కాలంలో పలు భాషల్లో నటించినప్పటికీ, తెలుగులోనే ఆమెకు విశేషమైన ఆదరణ లభించింది. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, రామ్ పోతినేని, మంచు విష్ణు వంటి ప్రముఖ హీరోల సరసన నటించి అభిమానులను అలరించింది. ప్రధాన కథానాయికగా మాత్రమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా స్వీకరిస్తూ తన నటనను చాటుకుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రణీత ఇటీవల చిత్రాలకు కొంత విరామం ఇచ్చింది. వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉన్న ఆమె ఇద్దరు పిల్లలకు తల్లిగా కొత్త జీవితాన్ని ఆనందంగా సాగిస్తోంది. అయినప్పటికీ ఆమె ఆకర్షణ, శైలి ఏమాత్రం తగ్గలేదని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమాలకు దూరంగా ఉన్నా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు అనుసంధానంగా ఉంటోంది. కుటుంబంతో గడిపే క్షణాలు, కొత్త ఫోటోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు మరోసారి అభిమానుల్లో చర్చకు దారితీసి, సినిమాల్లో తిరిగి ఎప్పుడు కనిపిస్తుందనే ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## విశ్వనాథన్ అండ్ సన్స్'గా సూర్య? వైరల్ అవుతున్న టైటిల్!



తమిళ అగ్రనటుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రంపై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 'సూర్య 46'గా ప్రచారంలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే శీర్షికను పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ పేరు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం. కేవలం కొన్ని రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉండటంతో, నిర్మాతలు తదుపరి పనులపై దృష్టి సారించారు. కథా నేపథ్యం, సూర్య పాత్ర తీరు ఈ చిత్రంలో భిన్నంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, సూర్య నటిస్తున్న మరో చిత్రం 'కరుప్పు' విడుదలైన మూడు నుంచి నాలుగు నెలల తర్వాతే ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. 'కరుప్పు' చిత్రం ఏప్రిల్ 2026లో విడుదలయ్యే అవకాశముండటంతో, ఈ కొత్త చిత్రం జూలై లేదా ఆగస్టు 2026లో ప్రేక్షకుల ముందుకు రావచ్చని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూర్యవెంకీ అట్లూరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారికంగా శీర్షిక ప్రకటిస్తే అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొనే అవకాశముంది.

## ధనుష్‌తో పెళ్లి పుకార్లపై మృణాల్ ఠాకూర్ క్లారిటీ..

### - ఏప్రిల్ 1న చేసుకుంటా అంటూ సెటైర్

సినీ రంగంలో పుకార్లు కొత్తవి కావు. నటీనటులు కలిసి ఒక కార్యక్రమంలో కనిపించినా వారిద్దరి మధ్య సంబంధం ఉందంటూ వార్తలు చక్కర్లు కొట్టడం సాధారణమే. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ విషయంలో కనిపించింది. గత కొన్ని రోజులుగా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒక వ్యక్తిగత కార్యక్రమంలో ఇద్దరూ కలిసి కనిపించడం ఈ పుకార్లకు కారణమైంది. ఆ తర్వాత మృణాల్ నటించిన సినిమా కార్యక్రమానికి ధనుష్ హాజరు కావడంతో ఈ వార్తలు మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఈ




ప్రచారంపై తాజాగా మృణాల్ స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా "ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?" అన్న ప్రశ్నకు మృణాల్ నవ్వుతూ, "ఫిబ్రవరి 14 కాదుడ ఏప్రిల్ 1న చేసుకుంటానేమో, అది మోసాల రోజు కదా!" అంటూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఈ వ్యాఖ్యతో పెళ్లి పుకార్లకు ఆమె సరదాగా చెక్ పెట్టింది. అదే సందర్భంగా ఈ వార్తలు ఎలా మొదలయ్యాయో కూడా తనకు తెలియదని, ఎలాంటి నిజం లేని విషయాలను నిజాలుగా ప్రచారం చేయడం బాధ కలిగిస్తుందని ఆమె పేర్కొంది. తామిద్దరం కేవలం మంచి స్నేహితులమేనని, అంతకుమించి ఏమీ లేదని మరోసారి స్పష్టం చేసింది. దీంతో ధనుష్‌మృణాల్ పెళ్లి వార్తలకు పూర్తి స్థాయిలో ముగింపు పలికినట్లైంది.

## ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని

### ఆకట్టుకుంటున్న 'శ్రీనివాస మంగాపురం' ఫస్ట్ లుక్

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా తెలుగు సినీ అభిమానులకు ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విడుదలైన పోస్టర్‌లో "ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని" అనే భావోద్వేగ డైలాగ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం యువతను ఆకట్టుకునేలా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు సినీ రంగంలోకి అడుగుపెడుతుండటంతో సినిమాపై సహజంగానే అంచనాలు పెరిగాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటి కుమార్తె రాషా తడాని కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతోంది. 'ఆర్ ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్ లుక్ విడుదలతోనే 'శ్రీనివాస మంగాపురం'పై సినీ వర్గాల్లో




చర్చ మొదలైంది. ప్రేమకథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం త్వరలోనే చిత్రీకరణ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న కొత్త హీరోగా జయకృష్ణ ఎలా మెప్పిస్తాడో అన్న ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY,** and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.NO 1-32 Markondeya Nagar, Choutuppal Muncipality, Yadadri Bhuvanagiri District, Telangana State 508252, Published at H.NO 1-32, Markondeya Nagar, Choutuppal Muncipality, Yadadri Bhuvanagiri District, Telangana State 508252., **EDITOR : POLOJU SRINIVASA CHARY. RNI NO : TGTEL/25/A0305,** Cell : 9985389183., **Email id : vaarthavedhikasurya.yadadri@gmail.com**